ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 23 ఏప్రిల్ 2025



సీఎంపై దాఖలైన పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్యను వరుణ ఎమ్మెల్యే పదవిని రద్దు చేయాలని హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను న్యాయమూర్తి సునిల్‌దత్ యాదవ్ ధర్మాసనం మంగళవారం కొట్టేసింది. వరుణ నియోజకవర్గం కొడనహళ్ళికి చెందిన శంకర్ పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేశారు. గ్యారెంటీ పథకాలు ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ మార్గదర్శకాలకు వ్యతిరేకమని, అది ఏఐసీసీ ప్రణాళిక కాదని, రాష్ట్ర పార్టీ ప్రణాళికగా పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర నిధులను ఉచిత పథకాలకు వినియోగించుకోరాదని ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని పిటిషన్‌లో పేర్కొన్నారు.



రాశులుగా పోసిన కీరదోస

దోస రైతుకు నిరాశ..!

- పడిపోయిన కీరదోస ధరలు
- కిలో రూ.5 నుంచి రూ.7లోపే..
- నష్టాలు తప్పవని రైతుల ఆవేదన

హోసూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కీరదోస సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుత వేసవి సీజన్‌లో విరివిగా ఉపయోగించే కీరదోస దిగుబడి ఆశాజనకంగా ఉన్నా కనీస ధర లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలలో వివిధ రకాల కూరగాయలు అధికంగా పండిస్తున్నారు. ఉత్తనపల్లి, బాగలూరు ప్రాంతాల్లో సుమారు 700 ఎకరాల్లో కీరదోస సాగు చేశారు. గత ఏడాది వేసవిలో కిలో కీరదోస రూ.50 ధర పైగా పలికింది. అదే ఊపుతో ఈ ఏడాది విస్తృతంగా పంట పండించారు. అయితే ఈ సారి ధర భారీగా పడిపోయింది. మంగళవారం హోసూరు మార్కెట్లో కిలో రూ.5 నుంచి రూ.7 లోపే పలికింది. కనీసం ప్రయాణ ఖర్చులు కూడా రావని రైతులు వాపోతున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడి..!



- కన్నడిగుడి మృతి..
- ప్రమాదంలో మరికొందరు..
- అధికారులతో సీఎం అత్యవసర సమావేశం

బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో కర్ణాటకకు చెందిన రియల్టర్ మంజునాథ రావ్ మృతిచెందారు. ఆయన భార్య పల్లవి, ఎనిమిదేళ్ల కుమారుడు క్షేమంగా ఉన్నారు. కశ్మీర్‌కు వెళ్లిన పలువురు కన్నడిగులు ప్రమాదంలో చిక్కుకోవడంతో సీఎం సిద్దరామయ్య అప్రమత్తమయ్యారు. చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, పోలీసు ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. కన్నడిగులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు అధికారుల బృందాన్ని కశ్మీర్‌కు పంపించారు. రియల్టర్ మంజునాథ శివమొగ్గలోని విజయనగర్ నివాసి. తన భార్య పల్లవి, ఎనిమిదేళ్ల కుమారుడితో కలసి ఈ నెల 19న ఆయన కశ్మీర్‌కు వెళ్లారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారని శివమొగ్గ జిల్లా అధికారి గురుదత్త హెగ్డే ప్రకటించారు. ఆయన భార్య, కుమారుడు క్షేమంగా ఉన్నారని తెలిపారు. మంజునాథ మృతదేహాన్ని శివమొగ్గకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఆయన భార్య, కుమారుడిని సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రానికి చెందిన అభిజ్ఞానరావ్ అనే వ్యక్తి ప్రమాదంలో ఇరుక్కున్నారని తెలిపారు. కన్నడిగులను రక్షించి, సురక్షితంగా తీసుకువచ్చేందుకు అధికారుల బృందం వెళ్లిందని తెలిపారు.



మంజునాథ (ఫైల్)

యూపీఎస్సీ ఫలితాల్లో ఇద్దరు వైద్యులకు ఉత్తమ ర్యాంకులు



సచిన్ గుత్తూరు రంగమంజు

బెంగళూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్రానికి చెందిన ఇద్దరు వైద్యులు ఉత్తమ ర్యాకులు సాధించారు. నగరానికి చెందిన డాక్టర్ రంగమంజు జాతీయ స్థాయిలో 24వ ర్యాంకు సాధించారు. హావేరీ జిల్లాకు చెందిన మరో వైద్యుడు సచిన్ గుత్తూరుకు 41వ ర్యాంకు వరించింది. 29ఏళ్ల సచిన్ ఉత్తమర్యాంకు సాధించడంపై పలువురు ప్రశంసిస్తున్నారు. రాణిబెన్నూరు తాలూకా కొడియాల హొసపేట గ్రామానికి చెందినవారు. డాక్టర్‌గా కొనసాగుతున్న సచిన్ నాల్గో ప్రయత్నంలో ర్యాంకు సాధించారు. ఆయన హరిహరలో ప్రాథమిక విద్యను, దావణగెరెలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. వీరి ర్యాంకులపై అధికారులు, నాయకులు అభినందనలు తెలిపారు.

అంతిమ నిర్ణయం.. హస్తినలోనే..!





- ఢిల్లీకి చేరిన కులగణన
- ఖర్గే, రాహుల్‌కు సవాల్..!
- మంత్రుల మధ్య కుదరని ఏకాభిప్రాయం

బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కులగణన నివేదిక నిర్ణయాన్ని అధిష్ఠానం వద్దే తేల్చుకోవాలని సీఎం సిద్ధరామయ్య నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కులగణన నివేదిక అమలు ద్వారా అన్ని వర్గాలకు మరింత చేరువ కావాలని భావించిన ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగులుతోంది. కులగణన నివేదికను మంత్రివర్గంలో స్వీకరించిన రోజున ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో అందరూ సంతోషంగానే చర్చించారు. కేవలం మంత్రుల వద్ద మాత్రమే ఉండే గణాంకాలు బహిరంగం కావడంతో కులసంఘాలు నిలదీసే పరిస్థితి ఏర్పడింది. ఈప్రభావం ఎక్కడికి దారి తీస్తుందోనని అధిష్ఠానం సునితంగా పరిశీలిస్తోంది. గతవారం జరిగిన కేబినెట్ భేటీలో సమగ్రంగా చర్చ ఉంటుందని మంత్రులందరూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తారని సీఎం సిద్దరామయ్య భావించారు. అయితే కేబినెట్‌లో ఎవరికి వారు... వారి కులాలకు అనుకూలంగా మాట్లాడారు. కులగణన నివేదికపై చర్చించాల్సిన మంత్రులు ఆమోదించే ప్రసక్తే లేదనడం సవాల్ చేసినట్లయ్యింది. మంత్రివర్గంలో చోటు చేసుకున్న అన్ని పరిణామాలను కాంగ్రెస్ అధిష్ఠానం వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి కులగణన నివేదికను స్వీకరించే విషయంలో సీఎం సిద్దరామయ్య అగ్రనేత రాహుల్‌గాంధీతో చర్చించారు. గ్రీన్ సిగ్నల్ లభించాక కేబినెట్ ముందుకు తీసుకొచ్చారు. కులగణన వ్యవహారంలో అగ్రకులాలు ప్రారంభం నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. అధిష్ఠానం అనుమతితో స్వీకరిస్తున్నందున అందరూ సమ్మతిస్తారని భావించారు. పార్టీ, మంత్రులు, ముఖ్యమంత్రి అనే ఆలోచన లేకుండానే వారి కులాలు, సామాజికవర్గాలకు అనుకూలంగా మంత్రులు మాట్లాడడం కేబినెట్‌లో బేదాభిప్రాయాలకు కారణమైందని చెప్పవచ్చు. అందుకు కారణం కేబినెట్ భేటీకి ముందు ఒక్కలిగ సంఘం ప్రత్యేకంగా సమావేశమై ప్రభుత్వానికి సవాల్ విసిరింది. ఇక వీరశైవలింగాయత స్వామీజీలు ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. మరోవైపు బ్రాహ్మణ, రెడ్డి సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. మంత్రులు వారి కులసంఘాల పరిధిని దాటే మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో వ్యతిరేకించారు. లింగాయత మంత్రుల రహస్య సమావేశం వెనుక పలువురు స్వామీజీలు ఉన్నట్లు తెలుస్తోంది. లింగాయత మంత్రుల్లో ఎంబీ పాటిల్, ఎస్ఎస్ మల్లికార్జున, శరణబసప్ప దర్శనాపుర, శివానందపాటిల్, శరణప్రకాశ్ పాటిల్, లక్ష్మీ హెబ్బాళ్కర్ ఏకాభిప్రాయంతో ఉండాలని తీర్మానించారు. వాస్తవానికి అంతకుముందే కేబినెట్ ముందుకు కులగణన నివేదిక తీసుకురావాలని భావించినా డీసీఎం డీకే శివకుమార్ అడ్డుకున్నట్లు తెలుస్తోంది.

దేశవ్యాప్త అమలుకు కాంగ్రెస్ హామీ..

కులగణన నివేదిక దేశవ్యాప్తంగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలవడంతో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో అమలు చేయాలనేది పార్టీ ఆలోచనగా ఉంది. పదేళ్లక్రితం సర్వే పూర్తి అయి నివేదిక రహస్యంగా ఉన్న కర్ణాటకలో అమలు చేయాలని భావించారు. అయితే కులసంఘాలకంటే ముందే మంత్రులే వ్యతిరేకించడం, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీకి ఇదో సవాల్‌గా మారింది. పైగా మల్లికార్జున ఖర్గే కర్ణాటక వాసి కావడంతో అడుగు ముందుకేసి కులగణనలో ఏమాత్రం వెనుకబడినా పార్టీకి చెడ్డపేరు వస్తుందని భావిస్తున్నారు. పలువురు మంత్రులు కేబినెట్ భేటీ తర్వాత తమ నిర్ణయం ప్రకటించామని, తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పుకొన్నారు. సీఎం సిద్దరామయ్య మాత్రం మంత్రులెవ్వరూ కులగణనపై ఇష్టారాజ్యంగా మాట్లాడలేదంటూ దాటవేశారు.

మంత్రుల అభిప్రాయ సేకరణ

కులగణన నివేదికపై చర్చకు తొలి కేబినెట్‌లోనే రసాభస అయ్యింది. ఎవరికి వారు మంత్రులు వ్యక్తిగత అభిప్రాయాలు తెలపడంతో సమావేశం అర్ధాంతరంగా వాయిదా పడింది. మే 2న కేబినెట్ భేటీ కులగణనకోసం నిర్వహించాలని తీర్మానించారు. అప్పట్లోగా మంత్రుల అభిప్రాయాలు సేకరించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈనెల 24న గురువారం కేబినెట్ భేటీ మలెహదేశ్వరలో జరగనుంది. సాధారణ అంశాలు మినహా కులగణన ప్రస్తావన రాకుండానే ముగించాలని భావిస్తున్నారు.

ముందుకెళ్తే.. మునిగిపోతామంటున్న మంత్రులు



కులగణన అంశంలో ముందుకెళ్తే పూర్తిగా మునిగిపోతామని, పార్టీకి తీరని నష్టం తప్పదని పలువురు మంత్రులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఎమ్మెల్యేలకు కులగణన భయం పట్టుకుంది. కులాల విషయంలో ఎదురేసుకుని ముందుకెళ్లడం సరికాదని పలువురు ఎమ్మెల్యేలు అగ్రనేతలకు వివరిస్తున్నట్లు తెలుస్తోంది. దావణగెరె ఎమ్మెల్యే ఇప్పటికే కులగణనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ప్రకటించారు. ఓటుబ్యాంకు విచ్ఛిన్నం కానుందని ఇది పార్టీని ఏ స్థాయిలోనైనా దెబ్బతీసే అవకాశాలు ఉంటాయని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. కులగణన విషయంలో ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ నేతలు ఆచితూచి మాట్లాడాలని నిర్ణయించారు. అందుకే కులగణనపై ఎక్కడా వ్యాఖ్యలు చేయడం లేదు. అధికార కాంగ్రెస్, మంత్రుల మధ్యనే సఖ్యత లేకుండా పోతున్న అంశంలో కలగజేసుకుని చెడ్డపేరు మోసుకోరాదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహొళి కులగణన అంశం మరో ఏడాదికైనా అమలు అసాధ్యమని కొట్టిపారేశారు. అంటే దీన్నిబట్టి కాలయాపన చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్సీ, బీసీ వర్గాలు కులగణన అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మిగిలిన ఒక్కలిగ, లింగాయత, బ్రాహ్మణ, రెడ్డి సామాజికవర్గంతోపాటు పలు కులాలు వ్యతిరేకిస్తున్నాయి. మరోవైపు కేబినెట్‌లో తీర్మానం పార్టీకే పరిమితం అవుతుందని, ప్రతిపక్షాలను భాగస్వామ్యం చేయాలనే కోణంలో శాసనసభ సమావేశాలు జరపాలని భావిస్తున్నారు. త్వరలోనే గ్రామపంచాయతీ, తాలూకా పంచాయతీ, పురపాలక, మహానగర పాలక ఎన్నికలు రానున్నాయి. ఉత్తర కర్ణాటకలోని 5 జిల్లాల్లో లింగాయత సామాజికవర్గం కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తుంది. మైసూరు ప్రాంతంలో ఒక్కలిగలు జేడీఎస్-బీజేపీలవైపు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. దీంతో రాబోయే ఎన్నికలు ఏవైనా పార్టీకి నష్టం మిగులుస్తాయనే పార్టీవర్గాలు ఆలోచనలో పడ్డాయి. పరిణామాలను పరిశీలిస్తే 24న కేబినెట్ సమావేశంలో ప్రత్యేకమైన నిర్ణయాలు ఉండకవచ్చునని తెలుస్తోంది.

దేవుడిపూజతో పాపాలు పోవు..!

- తోటి మనిషిని ప్రేమించడమే మానవత్వం
- 39 ఏళ్ల తర్వాత దొడ్డబాల జాతరలో సీఎం



పూజల్లో పాల్గొన్న సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అంతా సవ్యంగా ఉందని చేయరాని తప్పులు చేసి, ఆ తర్వాత దేవుడి పూజలు చేస్తే పాపాలు పోవని సీఎం సిద్దరామయ్య అన్నారు. దేవుడిని ఆరాధించడం నమ్మకమని వాటిని మూఢనమ్మకాలుగా భావించరాదన్నారు. మండ్య జిల్లా నాగమంగల తాలూకా బిండిగనవలి హోబళి దొడ్డబాల గ్రామంలో 39ఏళ్ల తర్వాత జరుగుతున్న హుచ్చప్పస్వామి, 14 కూటాల దేవుళ్ల జాతరను మంగళవారం సీఎం సిద్దరామయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మనిషి వికృతమైన చర్యలకు పాల్పడి ఆ తర్వాత దేవుడికి మొక్కులు తీర్చుకున్నా ప్రయోజనం లేదన్నారు. తోటి మనిషిని ప్రేమించాలన్నారు. సమాజంలో అన్ని కులాలు, మతాలు ఒక్కటేనని, వారి నమ్మకాలు వేర్వేరుగా ఉంటాయన్నారు. ఒకరి నమ్మకం పట్ల మరొకరికి గౌరవం ఉండాలన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అందరి నమ్మకాలు పాటించే అవకాశం ఇచ్చిందన్నారు. ఆర్థిక, సామాజికశక్తి పెరిగితే కుల వ్యవస్థ తగ్గుతుందన్నారు. మంత్రులు చలువరాయస్వామి, బైరతి సురేశ్‌తోపాటు ఎమ్మెల్యేలు నాయకులు పాల్గొన్నారు. హుచ్చప్పస్వామి ఆలయంలో ముఖ్యమంత్రి పూజలు నిర్వహించారు.

అగ్నిగుండంలో పడి అర్చకుడికి తీవ్రగాయాలు

మండ్య జిల్లా నాగమంగల తాలూకా దొడ్డబాల గ్రామంలో అగ్నిగుండంలో నడిచి వెళ్తున్న అర్చకుడు అదుపు తప్పి కిందపడ్డంతో తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన అతడిని బెళ్ళూరు సమీపంలోని బీజీఎస్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. దొడ్డబాళ గ్రామంలో హుచ్చప్పదేవర జాతర జరుగుతోంది. 39ఏళ్ల తర్వాత ఇక్కడ జాతర నిర్వహిస్తున్నారు. వీరదేవరలు పెద్ద పండుగలో భాగస్వామ్యం కానున్నారు. 14 కూటాల దేవుళ్ల పండుగ జరుగుతోంది. ఉదయం అగ్నిగుండంలో నడిచి వెళ్తూ అర్చకుడు గుడ్డప్ప శివరామ జారి పడ్డాడు. భక్తులు అప్రమత్తమై వెంటనే అతడిని అగ్నిగుండం నుంచి బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మధ్యాహ్నం సీఎం సిద్దరామయ్య జాతరను ప్రారంభించారు.





కోనిలతోట తండా వద్ద కురిసిన వడగండ్లు

గుడేకోట వద్ద నేలకొరిగిన బొప్పాయిని చూపుతున్న రైతు

రైతును ముంచిన వడగండ్ల వాన

- బళ్లారి, విజయనగర జిల్లాల్లో భారీ పంట నష్టం
- నేలకొరిగిన బొప్పాయి, అరటి చెట్లు


కంప్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వడగండ్ల వర్షాలు రైతులకు రూ.లక్షల్లో నష్టాలు మిగిలిస్తున్నాయి. బళ్లారి, విజయనగర జిల్లాలో వడగండ్ల వర్షాలు కురిసి వరి, బొప్పాయి పంటలు పూర్తిగా నేలకొరిగాయి. ఈ యేడాది వేసవిలోనే కురుస్తున్న అకాల వర్షాలు కురిసి అన్నదాతకు ఆందోళన మిగిలిస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యాన పంటలు తీవ్ర నష్టాలకు గురవుతున్నాయి. మామిడి, బొప్పాయి, అరటి చెట్లు నేలకొరిగిపోతున్నాయి. విజయనగరం జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి తాలుకాలోని కోగలి తండా, చిమ్మనహళ్లి, మాసరి నెల్కుద్రి, హలే నెల్కుద్రి గ్రామాల్లో సోమవారం రాత్రి వడగండ్ల వాన కురిసింది. ఈ వానలు రైతన్నలకు కష్టాలను మిగిల్చాయి. అలాగే కూడ్లిగి తాలుకాలోని గుడేకోట ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా తొమ్మిది ఎకరాల బొప్పాయి తోట పూర్తిగా ధ్వంసమైంది. అర్ధరాత్రి గాలివానతో పాటు కురిసిన భారీ వర్షాలకు బొప్పాయి తోట పూర్తిగా నేలకొరిగింది. సిద్దేష్ అనే రైతుకు చెందిన తొమ్మిది ఎకరాల భూమిలో సాగు చేసిన బొప్పాయి పూర్తిగా నేలకొరిగి రైతన్నకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా సిద్దేష్ మాట్లాడుతూ తమ తొమ్మిది ఎకరాల పంట వడగండ్ల వానకు దెబ్బ తినిందని, లక్షల్లో నష్టాలపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు ఇలా కళ్లకు ఎదురుగానే నేలకొరవడటంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకున్నారు.

రిక్కీరై కాల్పుల కేసులో గన్‌మన్ అరెస్టు


బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మాజీ డాన్ ముత్తప్పరై కుమారుడు రిక్కీ రైపై కాల్పుల కేసులో అతడి గన్‌మెన్ మన్నప్ప విఠల్‌ను బిడది పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బిడదిలోని నివాసం నుంచి అర్ధరాత్రి బయటకు వస్తున్న సమయంలో రిక్కీపై కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. కాల్పులు జరిపినపుడు వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ బసవరాజ్ ఫిర్యాదు మేరకు సవతి తల్లి అనురాధ ముత్తప్పరైకు ఒకప్పటి ఆప్తుడైన రాకేశ్‌మల్లితోపాటు నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బుల్లెట్ల ఆధారంగా తుపాకీని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు గన్‌మన్ మన్నప్ప విఠల్‌ను అరెస్టు చేశారు. ఎస్పీ శ్రీనివాస రెడ్డి విచారణ జరుపుతుండగానే ఒక్కసారిగా ఛాతీలో నొప్పి రావడంతో హుటాహుటిన అతడిని ఆసుపత్రికి తరలించారు. కాగా ఎఫ్ఐఆర్ నమోదు ప్రకారం ఏ1 నిందితుడిగా పేర్కొన్న రాకేశ్ మల్లి మంగళవారం బిడది పోలీస్‌స్టేషన్‌కు న్యాయవాదులతో కలసి విచారణకు హాజరయ్యారు. మరోవైపు ఈ కేసులో ఏ2 నిందితురాలు, ముత్తప్ప రై రెండో భార్య అనురాధకు హైకోర్టు రిలీఫ్ ఇచ్చింది. అనురాధపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 14న అనురాధ యూరప్ పర్యటనకు వెళ్లారు. హత్యకేసుకు అనురాధకు ఎటువంటి సంబంధం లేదని ఆమె తరపు న్యాయవాదులు వాదించారు. ఆరు నెలలక్రితమే ఆస్తుల వివాదం పరిష్కారమైందన్నారు.

బోగస్‌లలో గుబులు

● టీచర్ల బదిలీలకు సిద్ధమైన విద్యాశాఖ ● గతంలో కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో అడ్డగోలు లబ్ధి



- కుప్పలుతెప్పలుగా వినికిడి లోపం సర్టిఫికెట్లు
- టిస్ సమాచారం మేరకు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో 627 మంది..
- వాటి స్క్రూటినీ, కొత్తవి మంజూరుకు రేపట్నుంచి మెడికల్ క్యాంపులు
- అయ్యవార్లలో టెన్షన్



అనంతపురం విద్య, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు కొత్త గుబులు పట్టుకుంది. టీచర్ల బదిలీల కోసం ఇప్పటికే ప్రభుత్వం తొలిసారి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ బదిలీల యాక్ట్-2025 తీసుకొచ్చింది. ఈ క్రమంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద అదనపు పాయింట్లు పొందిన టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధమైంది. మూడు రోజులపాటు మెడికల్ క్యాంపులు నిర్వహించి పాత వాటిని స్క్రూటినీ చేసి.. కొత్త వాటిని ఇవ్వనున్నారు. దీంతో టీచర్లకు కొత్త పరీక్షలు గుబులు పుట్టిస్తున్నాయి. చాలామంది టీచర్లు లేని చెవుడు ఉన్నట్లు, రాని రోగాలు కూడా వచ్చినట్లు, తమ పిల్లలు, తల్లిదండ్రులు డిపెండెంట్స్ అంటూ బోగస్ సర్టిఫికెట్లు పొందారు. వాటి ద్వారా స్పెషల్ పాయింట్లు పొంది బదిలీల్లో లబ్ధి పొందారు. తీరా ఈనెల 24, 25, 26 తేదీల్లో మూడు రోజలపాటు వైద్య పరీక్షలు, సర్టిఫికెట్ల పునఃపరిశీలన ఉండటంతో అక్రమార్కులు కళ్లు తేలేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లు 627 మంది ఉన్నట్లు స్వయానా వారే ప్రకటించుకున్నారు. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్)లో నమోదు చేసుకున్నారు. అవి సుమారు 1,000 వరకూ ఉంటాయని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా టీచర్లలో కొత్త పరీక్షల టెన్షన్ మొదలైంది.

రేపట్నుంచి క్యాంపులు..

ఇప్పటికే సర్టిఫికెట్లు ఉన్న టీచర్లు ఇప్పుడు 24వ తేదీ నుంచి 3 రోజులపాటు నిర్వహించే వైద్య శిబిరాల్లో వాటిని వెరిఫికేషన్ చేసుంచుకోవాలి. డాక్టర్లు.. టీచర్ల పాత సర్టిఫికెట్లు పరిశీలించడంతోపాటు, వారి డిపెండెంట్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వైద్య పరీక్షల్లో తప్పని తేలితే... రిజెక్ట్ చేస్తారు. ఈ మెడికల్ క్యాంపు ల్లో జారీచేసిన కొత్త సర్టిఫికెట్ల ఆధారంగానే బదిలీల్లో టీచర్లకు ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్లు కేటాయిస్తారు.



గతంలో బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

చాలామంది బోగస్ బాట...

గతంలో చాలామంది టీచర్లు బోగస్ సర్టిఫికెట్ల బాట పట్టారు. చెవుడు లేకున్నా...ఉన్నట్టు, పిల్లలు, తల్లిదండ్రులకు సైతం లేని మానసిక జబ్బులు ఉన్నట్టుగా కూడా చూపి స్పెషల్ పాయింట్లు పొందడంతోపాటు, ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద లబ్ధి పొందారు. కొందరు టీచర్లు నియామకాల్లో సైతం ఇదే ఫార్ములా ఉపయోగించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. 1994 డీఎస్సీలో కొందరు అభ్యర్థులు చెవుడు ఉందని ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి లబ్ధిపొందారని సమాచారం. ఎవరూ గుర్తించకపోవడంతో 1996, 1998 డీఎస్సీల సమయంలో కుప్పలుతెప్పలుగా అభ్యర్థులు చెవుడు ఉందని ఫేక్ సర్టిఫికెట్లు చూపించి, ఉద్యోగాల్లో చేరారు. తర్వాత కాలంలో ఉపాధ్యాయుల బదిలీల్లోనూ ఇదే కొనసాగించారని సమాచారం. అంతేకాకుండా తమ పిల్లలు, తల్లిదండ్రులు సైతం డిపెండెంట్స్ అంటూ సర్టిఫికెట్లు చూపి లబ్ధి పొందారు. ఇలాంటివారు చాలామందే ఉన్నారు. మూడేళ్ల కిందట బుక్కరాయసముద్రం మండలంలోని ఒక స్కూల్‌లో పనిచేసిన హెచ్‌ఎం తనకు 80 శాతం అంగవైకల్యం ఉందంటూ సర్టిఫికెట్ పెట్టి బదిలీల్లో లబ్ధి పొందారు. ఆమె నిత్యం కారులో స్కూల్‌కు వచ్చేవారని తోటి టీచర్లే చెబుతారు. 80 శాతం అంగవైకల్యం ఉన్న ఆమె కారు డ్రైవ్ చేస్తూ.. స్కూల్‌కు ఎలా వస్తారన్నది వింటుంటే.. ఏ స్థాయిలో బోగస్ సర్టిఫికెట్ సృష్టించారో ఇట్టే అర్థమవుతోంది. మరికొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు సైతం చెవుడు ఉందని చెప్పి సర్టిఫికెట్లు చూపించి బదిలీల్లో లబ్ధి పొందుతున్నారు. ఇంకా కొందరు టీచ ర్లు చిన్నపాటి రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఘటనలను చూపి దివ్యాంగులుగా చిత్రీకరించి... లబ్ధిపొందారు. కొందరు టీచర్లు.. వైద్యులకు రూ.30 వేలు, రూ.50 వేలు లంచాలు ఇచ్చుకుని, దొడ్డిదారిలో సర్టిఫికెట్లు పొందారు కూడా. ఇలా చెప్పుకుంటూ వెళ్తే... చాలా మంది టీచర్లు బోగస్ సర్టిఫికెట్ల బాట పట్టి... అడ్డదారులు తొక్కి. అర్హుల అవకాశాలకు గండి కొట్టారు.

పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికారికంగా ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్ల కేటగిరీ టీచర్లు 672 మంది ఉన్నట్లు టిస్ ద్వారా తెలుస్తోంది. వాస్తవానికి 1000 మంది వరకూ టీచర్లు ఉంటారని జిల్లా విద్యాశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. టిస్ రిపోర్ట్ మేరకు 627 మంది మాత్రమే ఉంటే.. మిగిలిన వారు దొడ్డిదారిలో వచ్చిన వారైనా ఉండాలి, లేదంటే టిస్‌లో అప్‌డేట్ చేయనివారైనా ఉండాలి. ఉద్దేశపూర్వకంగానైనా టిస్‌లో అప్‌లోడ్ చేయని వారైనా ఉండాలి. స్పెషల్ మెడికల్ క్యాంపుల్లో పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తే... బోగస్ సర్టిఫికెట్ల బాగోతం బయటపడుతుందనడంతో సందేహం లేదు. డాక్టర్లకు మామూళ్లు ఇచ్చి సర్టిఫికెట్లు చేయించుకున్నోళ్లు చాలామందే ఉన్నారు. ఇప్పుడు మళ్లీ స్పెషల్ మెడికల్ క్యాంపుల్లో వాళ్లు ఇచ్చిన సర్టిఫికెట్లు అదే డాక్టర్ల చేతికి చేరితే... మళ్లీ అక్రమాలు జరిగే ప్రమాదం ఉంది. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెడితే.. అక్రమాలకు చెక్ పడే అవకాశం ఉంటుంది. ఇతర జిల్లాల డాక్టర్లనైనా నియమించాలి, విద్యాశాఖ, వైద్యశాఖల సమన్వయంతో పారదర్శకంగానైనా పరీక్షలు నిర్వహించాలి. అప్పుడే అక్రమార్కులు బటయపడే అవకాశం ఉంది.

అర్హతలు ఇవీ..

- శారీరక వైకల్యం 40 శాతం నుంచి 70 శాతం అంతకంటే ఎక్కువ విజువల్లీ చాలెంజ్డ్, ఆర్థోపెడికల్లీ చాలెంజ్డ్, హియరింగ్ ఇంపెయిర్డ్ ఉద్యోగులకు స్పెషల్ పాయింట్లు కేటాయిస్తారు.
- శారీరక వైకల్యం 80 శాతం, అంతకంటే ఎక్కువ విజువల్లీ చాలెంజ్డ్, ఆర్థోపెడికల్లీ చాలెంజ్డ్ ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో స్పెషల్ పాయింట్లు వర్తిస్తాయి.
- మెడికల్ గ్రౌండ్స్ కింద క్యాన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ/ఆట్రియల్ సెప్టెల్ డిఫెక్ట్/అవయవ మార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, ఎముకల టీబీ, కిడ్నీల మార్పిడి/డయాలసిస్, స్పైనల్ సర్జరీ, మానసిక జబ్బులతో బాధపడే పిల్లలుగానీ, భార్యగానీ ఉండి ఉద్యోగిపై ఆధారపడి ఉండటంతోపాటు చికిత్స పొందుతూ ఉండాలి.
- జువైనల్ డయాబెటిస్, థలసీమియా, హీమోఫీలియా, మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధులతో బాధపడే పిల్లలు.. ఉద్యోగిపై ఆధారపడి ఉండటంతోపాటు చికిత్స పొందుతూ ఉండాలి.
- హృదయ రంధ్రాల లోపంతో జన్మించిన పిల్లలకు ఆపరేషన్ చేసిన తేదీ నుంచి 3 ఏళ్లలోపు ఉండాలి (ఇలాంటి పిల్లలున్న ఉద్యోగికి).

జై జవాన్ జై కిసాన్

అతడిదో సాధారణ రైతు కుటుంబం. చదువుకుంటూనే పొలం పనుల్లో తల్లిదండ్రులకు తోడు ఉండేవాడు. ఇంటర్ చదువుతున్న సమయంలో ఆర్మీకి ఎంపికయ్యాడు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 17 ఏళ్ల పాటు సేవలందించి రిటైర్డ్ అయ్యాడు. అనంతరం స్వగ్రామానికి చేరుకుని తనకు ఎంతో ఇష్టమైన సేద్యంలోకి దిగాడు. సేంద్రియ పద్ధతులతో వివిధ రకాల పంటలు సాగు చేసి, మంచి దిగుబడులతో లాభాలు ఆర్జిస్తున్నాడు. ఆయనే కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ సైనికుడు శ్రీనివాస్‌రెడ్డి.



వ్యవసాయంలో రాణిస్తున్న మాజీ సైనికుడు
సీజన్‌కు అనుగుణంగా పంటల సాగు
మంచి దిగుబడులతో ఆదర్శంగా నిలుస్తున్న శ్రీనివాస్‌రెడ్డి





సాగు చేసిన చీనీ, మిరప పంటను చూపుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కుటుంబ నేపథ్యం

శ్రీనివాస్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబం. తల్లి ఆదిలక్ష్మి, తండ్రి కృష్ణారెడ్డి నిత్యం పొలం పనులు చేస్తుండేవారు.వీరికి సాయంగా చిన్నకుమారుడైన శ్రీనివాస్‌రెడ్డి సెలవు రోజుల్లో పనులకు వెళ్లేవాడు. అలా వ్యవసాయం మీద మోజు ఏర్పడింది. అయితే తల్లిదండ్రులు మాత్రం సేద్యం వద్దని, బాగా చదువుకుని ఉద్యోగం తెచ్చుకోమని చెబుతుండేవారు. ఈక్రమంలోనే 2001లో పదో తరగతి పూర్తి చేసి ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాడు. మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో ఆర్మీకి సెలక్ట్ అయ్యాడు. శిక్షణ అనంతరం శ్రీనగర్, జమ్మూకశ్మీర్ వంటి వివిధ ప్రాంతాల్లో పని చేశాడు. ఆర్మీలో పని చేసే సమయంలోనే వివాహం చేసుకున్నాడు. ఈయనకు ఇద్దరు సంతానం ఉన్నారు.

జవాన్ నుంచి కిసాన్‌గా...

2019లో జవాన్‌గా రిటైర్డ్ అయిన శ్రీనివాస్‌రెడ్డి కిసాన్‌గా మారాడు. ఆర్మీ నుంచి ఇంటికొచ్చాక తమ కుటుంబానికి ఉన్న 15 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చాడు. ఇందులో చీనీ, వేరుశనగ, వరి, మిరప, టమోటా వంటి పంటలు పండిస్తున్నాడు. అరు బోరు బావుల ద్వారా డ్రిప్పులు, స్ప్రింక్లర్ల సాయంతో పంటలకు నీటి తడులు అందిస్తున్నాడు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నాడు. కనగానపల్లిలో లైన్‌మన్‌గా పని చేస్తున్న తన అన్న రాజశేఖర్‌రెడ్డి కూడా సేద్యంలో సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్మీ నుంచి రిటైర్డ్ అయిన పలు ప్రైవేటు సంస్థల్లో సెక్యూరిటీ గార్డుగా అవకాశం వచ్చింది. అయితే అక్కడ విధులు నచ్చక చేరలేదు. కొన్నాళ్లపాటు ఇసుక రీచ్‌లో ఎస్‌పీఎస్‌టీగా పని చేశాడు. వారి విధులు తొలగించడంతో తనకు ఇష్టమైన వ్యవసాయం వైపు మళ్లాడు. కుటుంబ సభ్యులు సహకారంతో సీజన్‌కు అనుగుణంగా పంటలు పండిస్తూ మంచి లాభాలు గడిస్తున్నాడు. దేశానికి ఆర్మీ జవానుగా సేవ తనకు గర్వంగా ఉందని, ప్రస్తుతం వ్యవసాయం తనకూ తన కుటుంబానికి తోడుగా ఉండటం ఆనందంగా ఉందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-కనగానపల్లి)



రైలు దొంగల సవాల్

కొత్త ప్లాన్లతో విరుచుకుపడుతున్న వైనం

జీఆర్పీకి తలనొప్పిగా మారిన కట్టడి





గుంతకల్లు ఔటర్‌లో నిలిచిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్

వేసవి వచ్చిందంటే రైళ్లలో రద్దీ విపరీతంగా పెరుగుతుంది. దొంగలు సైతం ప్రతాపం చూపుతారు. ప్రతిసారీ కొత్త కొత్త ప్లాన్లతో ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ)లకు దొంగలు సవాల్ విసురుతున్నారు. జీఆర్పీ సిబ్బంది దొంగల పాత ప్లాన్‌ను ఛేదించలోపే.. కొత్త పథకంతో విరుచుకుపడుతున్నారు. దీంతో వేసవి వచ్చిందంటే రైళ్లలో చోరీలు, దోపిడీలను అడ్డుకోవడం సవాల్‌గా మారుతోంది. శ్రీసత్యసాయి, నెల్లూరు జిల్లాలో రైళ్లలో కొన్ని రోజుల క్రితం దోపిడీలు చేశారు. వేసవిలో నెల రోజులు ప్రశాంతంగా గడచిపోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) శాఖ వరుసగా రెండు రైలు దోపిడీలతో షాక్‌కు లోనైంది. రైళ్లలో గస్తీ ముమ్మరం చేసింది. సిబ్బంది కొరత నేపథ్యంలో జీఆర్పీ, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) శాఖలు.. సివిల్ పోలీసులతో కలిసి గస్తీ నిర్వహిస్తున్నాయి. వేసవి పూర్తయ్యే వరకూ ప్రయాణికులు కూడా జాగ్రత్తలు పాటించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

గుంతకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలకు పాల్పడే ముఠాలు ఎప్పటికప్పుడు కొత్త ప్లాన్లు వేస్తున్నాయి. తొలుత జనరల్, స్లీపర్ క్లాస్ ప్రయాణికుల్లా వచ్చి చైన్‌లాగి దోపిడీలు చేసేవారు. ఏడేళ్ల కిందట రైళ్లపైకి రాళ్లు రువ్వి, ప్రయాణికులను భయభ్రాంతులకు లోనుచేసి దోచుకెళ్లారు. ఐదేళ్లుగా ప్రధాన రైల్వే స్టేషన్ల ఔటర్లలో సిగ్నల్‌ను టాంపరింగ్ చేయడం, రైలు నిలిచే చిన్న స్టేషన్లపై కన్నేసి ప్రయాణికులను దోచుకున్నారు. ఇప్పుడు తక్కువ స్టాపింగ్‌లు ఉన్న సుదూర ప్రాంతాలకు వెళ్లే దురంతో ఎక్స్‌ప్రెస్‌లను టార్గెట్‌గా చేసుకుని, సిగ్నల్ టాంపరింగ్‌తో ప్రయాణికుల సొమ్ము దోచారు. ఈ ఏడాది మార్చి 29న శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి సమీపాన షిర్డీ-చెన్నై ఎక్స్‌ప్రెస్‌లోకి చొరబడిన దుండగులు.. ప్రయాణికుల మెడల్లోని నెక్లెస్‌లను లాక్కెళ్లారు. ఆ తర్వాత నాలుగు రోజులకే నెల్లూరు జిల్లాలో చండీఘర్-మధురై ఎక్స్‌ప్రెస్‌ను సిగ్నల్ టాంపరింగ్ ద్వారా నిలిపివేసిన దుండగులు ప్రయాణికులను దోచుకున్నారు. మహిళల మెడలోని నగలను లాక్కున్నారు. ఈ రైలు కంటే ముందుగా వచ్చిన హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ దుండగుల బారి నుంచి తృటిలో తప్పించుకుంది. ఈ మూడు రైళ్లు దూర ప్రాంతాలకు వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు కావడం, ప్రధాన స్టేషన్లకు దూరంగా వాటిని నిలిపి దోపిడీలకు పాల్పడడం యాదృచ్ఛికం కాదు. ఇలా.. తక్కువ స్టాపింగ్‌లు ఉన్న సూపర్ ఫాస్ట్ దురంతో ఎక్స్‌ప్రెస్‌లను ఈసారి దొంగలు టార్గెట్ చేశారు.



దొంగల ముఠాలివే..

మహారాష్ట్రకు చెందిన ప్రధి గ్యాంగ్ 2022 సంవత్సరంలో గుత్తి ఔటర్‌లో సిగ్నల్ టాంపరింగ్ చేసి, ప్రయాణికుల బంగారు ఆభరణాలను లాక్కెళ్లింది. అదే సంవత్సరం నెల్లూరు వద్ద సోలాపూర్ గ్యాంగ్.. ప్రయాణికులను దోచుకుంది. 2023లో యూపీకి చెందిన ఉన్నావ్ గ్యాంగ్ గుంతకల్లు వద్ద ప్రయాణికుల బ్యాగ్‌లు, ఆభరణాలు తస్కరించింది. అదే ఏడాది యూపీకి చెందిన గోండా గ్యాంగ్ హిందూపురం వద్ద ప్రయాణికులపై మత్తుమందు ప్రయోగించి, దోచుకుంది. గత సంవత్సరం కదిరి వద్ద యూపీకి చెందిన మీర్జాపూర్ గ్యాంగ్, అనంతపురం వద్ద గోండా గ్యాంగ్ మత్తుమందుతో రైలు ప్రయాణికులను దోచుకున్నాయి. వీటిపై జీఆర్పీ విచారణ చేపట్టి ప్రధి గ్యాంగ్‌కు చెందిన నలుగురిని, సోలాపూర్ ముఠా సభ్యులు ముగ్గురిని, ఉన్నావ్ గ్యాంగ్‌లో ఇద్దరిని, రెండు కేసుల్లో గోండా గ్యాంగ్ సభ్యులు ఆరుగురిని, మీర్జాపూర్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురిని అరెస్టుచేసి, రికవరీలు చేశారు.

నేర చరితులపై ప్రత్యేక దృష్టి

గతంలో రైలు దోపిడీలు, బ్యాగుల చోరీలు, మత్తుమందు ప్రయోగాలు జరిగిన ప్రదేశాలపై జీఆర్పీ, ఆర్పీఎఫ్ ప్రత్యేక దృష్టి సారించాయి. గుత్తి-తాడిపత్రి సెక్షన్‌లో దుండగ ముఠాలు సిగ్నల్ టాంపరింగ్‌తో ప్రయాణికులను దోచుకున్నాయి. గుత్తి-తిరుపతి రూటులోని యర్రగుంట్ల-కమలాపురం సెక్షన్‌లో, గుంతకల్లు-వాడి రూటులో ఆదోని-కొప్పల్ సెక్షన్‌లోనూ, గుంతకల్లు-సికింద్రాబాద్ రూటులో డోన్-కర్నూలు సెక్షన్‌లోనూ, విజయవాడ రూటులో డోన్-నంద్యాల సెక్షన్‌లోనూ దొంగల ముఠాలు బోగీలపైకి రాళ్లు రువ్వి, మహిళల ఆభరణాలను లాక్కెళ్లాయి. గుంతకల్లు, రేణిగుంట, తిరుపతి, పెనుకొండ, గుత్తి స్టేషన్ల వద్ద దొంగలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. అనంతపురం-హిందూపురం, ఒంగోలు-చీరాల, తిరుమల-విజయవాడ సెక్షన్లలో ముఠాలు.. ప్రయాణికులపై మత్తుమందు ప్రయోగాలతో దోచుకున్నాయి. ఈ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జీఆర్పీ, ఆర్పీఎఫ్ బలగాలు స్టేషన్లలోనూ, రైళ్లలోనూ భద్రతను పెంచాయి.

పరిష్కారం కాని ఔటర్ సమస్య

రైల్వే శాఖ పెద్ద స్టేషన్ల వద్ద ఔటర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేస్తుండడం సమస్యలకు తావిస్తోంది. పెద్ద స్టేషన్లకు సమీపాన దొంగల ముఠాలు సిగ్నల్ వ్యవస్థను దెబ్బతీసి ప్రయాణికులపై దాడులు చేస్తున్నాయి. స్టేషన్‌లో ప్లాట్‌ఫాం ఖాళీలేక బయట కటిక చీకట్లో రైళ్లను నిలిపివేస్తుండటంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతకల్లు జంక్షన్‌లో ఐదు ప్రధాన రూట్లలో రైలు మార్గాలున్నాయి. సాయంత్రం నుంచి ఉదయందాకా రైళ్లను పదుల సంఖ్యలో ఔటర్లలో నిలిపి వేస్తున్నారు. విజయవాడ రూటులో ఒకేసారి ఏకంగా మూడు రైళ్లను సైతం ఆపేస్తున్నారు. తిరుపతి, రాయచూరు, గుత్తి, ధర్మవరం, తదితర రైల్వే కూడళ్లలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించలేని పరిస్థితి నెలకొంది. ఆయా చోట్ల పోలీసు సిబ్బందిని నియమించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..



దొంగల కదలికలపై గట్టి నిఘా పెట్టాం. చోరీ, దోపిడీ కేసులను ఛేదించాం. రికవరీలు కూడా చేశాం. అయినా.. చోరీలకు ఆస్కారమివ్వకుండా ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. వేసవిలో కిటికీలు, తలుపుల వద్ద మహిళలు అప్రమత్తంగా ఉండాలి. విలువైన ఆభరణాలు ధరించి ప్రయాణాలు చేయడం మంచిదికాదు. ఔటర్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖను కో-ఆర్డినేషన్ మీటింగ్‌లో కోరాం. సిబ్బంది కొరతను అధిగమించడానికి సివిల్ పోలీసుల సహకారం తీసుకుంటున్నాం. **- రాహుల్ మీనా, జీఆర్పీ ఎస్పీ**

అభివృద్ధికి అడుగులు

నెరవేరుతున్న హామీలు

కణేకల్లులో డిగ్రీ కళాశాలకు మోక్షం
బీటీపీ భూసేకరణకు నిధులు
చంద్రబాబు ఎన్నికల పర్యటనకు ఏడాది పూర్తి

నిర్మాణ దశలో ఉన్న బాలికల జూనియర్ కళాశాల భవనం



రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబునాయుడు రాయదుర్గం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గంలోని కణేకల్లులో గత ఏడాది జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. ఏడాది కాలంలో పలు హామీలను నెరవేరుస్తున్నారు. కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని, భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలను అందిస్తానని, హంద్రీనీవా 36వ ప్యాకేజీకి మోక్షం కల్పిస్తానని ఇచ్చిన హామీలను ఏడాదిలోనే అమలుకు శ్రీకారం చుట్టారు.

కణేకల్లులో డిగ్రీ కళాశాలకు మోక్షం

ఎన్నికల సభలో భాగంగా చంద్రబాబు కణేకల్లులో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చా రు. ఇప్పటికే ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మంజూరు చేసింది. 2025-26 సంవత్సరంలో కళాశాల ప్రారంభించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐదెకరాల భూసేకరణ కోసం ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది కళాశాల ప్రారంభించేందుకు తాత్కాలికంగా ఖాళీ ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. రాయదుర్గం, ఉరవకొండ పట్టణాలకు వెళ్లి డిగ్రీ విద్యాభ్యాసం సాగించే పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు ఆ కష్టాలు తొలగిపోతాయి.



హెచ్చెల్సీలో జరుగుతున్న పనులు

కాలువ భూసేకరణకు రూ.64 కోట్లు

జీడిపల్లి నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు రెండు టీఎంసీల కృష్ణాజలాలను మళ్లించేందుకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు రూ. 960 కోట్లు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో పనులు నాన్చుతూ వచ్చింది. ఐదేళ్లలో పనులు ఏ మాత్రం ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో కాలువల తవ్వకాల భూసేకరణకు రూ. 64 కోట్లు నిధులను మంజూరు చేసింది. దీంతో పనులు మరింత వేగం అందుకోనున్నాయి. ఏళ్ల తరబడి కృష్ణాజలాల కోసం ఆ ప్రాంత ప్రజలు నిరీక్షిస్తున్నారు. నిధుల కేటాయింపుతో అభివృద్ధికి అడుగులు పడ్డాయి.

36వ ప్యాకేజీ పనుల్లో కదలిక

హంద్రీనీవా నుంచి సాగునీరు అందించేందుకు 36వ ప్యాకేజీ పనులను పదేళ్ల క్రితం మంజూరు చేశారు. ఇప్పటి వరకు భూసేకరణకు సంబంధించిన పరిహారం ఇవ్వలేదు. ఏడాది క్రితం కణేకల్లు బహిరంగ సభలో చంద్రబాబు ప్రకటించిన విధంగా భూసేకరణలో భూములు కోల్పోయిన రైతాంగానికి పరిహారం సొమ్మును ప్రభుత్వం మంజూరు చేసింది. హంద్రీనీవాలోని 36వ ప్యాకేజీ పనుల్లో కాలువ తవ్వకాలు చేశారు. భూమి కోల్పోయిన రైతులకు ఏళ్లతరబడి పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పూర్తిస్థాయిలో పరిహారం అందించడంతో మాట నెరవేర్చుకున్నారని అన్నదాతలు కొనియాడుతున్నారు.

బాలికల జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం

రాయదుర్గంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పెద్ద ఎత్తున చేరుతుండడంతో ప్రాధాన్యత సంతరించకుంది. గత టీడీపీ హయాంలో బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేసి భవనాల కోసం రూ.52 లక్షలు కేటాయించారు. వైసీపీ హయాంలో పనులు ఆగిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతంగా సాగుతున్నాయి. నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గుమ్మఘట్టలో బాలికల ఆశ్రమ కళాశాలకు సంబంధించి ఆగిపోయిన పనులను పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రూ. 32 కోట్లతో హెచ్చెల్సీకి ఉపశమనం

తుంగభద్ర ఎగువకాలువ ఆధునికీకరణ పనులు పూర్తిగా ఆగిపోయాయి. అధ్వాన్నస్థితికి చేరుకున్న కాలువను మరమ్మతులు చేయించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే మరమ్మతులకు రూ.32 కోట్లను మంజూరు చేసింది. ఏడాది క్రితం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఆధునికీకరణ పరిశీలనలో ఉన్నప్పటికీ నీటి సరఫరాకు అంతరాయంగా ఉన్న చోట మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. దీంతో హెచ్చెల్సీకి ఐదేళ్ల వైసీపీ శాపం నుంచి విముక్తి కలిగి ఉపశమనం లభించినట్లయింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి (జయంతి)



శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి 1891 ఏప్రిల్ 23న తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం సమీపంలోని పొలమూరులో జన్మించారు. కథా రచయితగా పేరొందారు. తెలుగు సాహిత్యంలో నవల, నాటకం, కథ, కవిత, చరిత్ర, పురాణ ఇతిహాసాలు, శాస్త్రాలు ఇలా ఎన్ని ప్రక్రియలు చేపట్టినా అందరిచే శెహబాష్ అనిపించుకున్నారు. ఆయన దృష్టిలో రచన అనేది ఒక తపస్సు. అవధానాలు కూడా చేశారు. ప్రబుద్ధాంధ్ర అనే పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు. సంగీతంలోనూ, ఆయుర్వేద వైద్యంలోనూ రాణించారు. 1961 ఫిబ్రవరి 25న కన్నుమూశారు.

అన్నపూర్ణాదేవి (జయంతి)




ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, పద్మభూషణ్ గ్రహీత అన్నపూర్ణాదేవి 1927 ఏప్రిల్ 23న ప్రస్తుత మధ్యప్రదేశ్ రాష్ట్రం మైహార్‌లో జన్మించారు. మైహార్ ఘరానా స్థాపకులైన అల్లావుద్దీన్ ఖాన్ కుమార్తె. ఆమె అసలుపేరు రోషనారా ఖాన్. మైహార్ మహారాజు బ్రిజ్‌నాథ్‌సింగ్ ఆమె పేరును అన్నపూర్ణా దేవిగా మార్చారు. సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్‌ను వివాహం చేసుకుంది. ఎన్నో కచేరీలు చేసింది. కుమారుడు సుభేంద్ర శంకర్ కూడా సంగీత విద్వాంసుడే. ఆశిష్‌ఖాన్ (సరోద్), అమిత్ భట్టాచార్య (సరోద్), బహదూర్ ఖాన్ (సరోద్), హరిప్రసాద్ చౌరాసియా (బన్సూరి) వంటి వారు ఆమె శిష్యులే కావడం విశేషం. సంగీత నాటక అకాడమీ పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు. 2018 అక్టోబరు 13న కన్నుమూశారు.

ఎస్ జానకి (పుట్టినరోజు)



జానకమ్మగా గౌరవం అందుకున్న ప్రముఖ నేపథ్య గాయని శిష్ట శ్రీరామమూర్తి జానకి 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా జన్మించారు. తన 50ఏళ్ల సినీ జీవితంలో వివిధ భాషలలో దాదాపు 50 వేలకుపైగా పాటలు పాడారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో ఎక్కువగా పాటలు పాడారు. ఉత్తమ గాయనిగా జాతీయ పురస్కారం 4సార్లు, 31 సార్లు వివిధ రాష్ట్రాల ఉత్తమ గాయని పురస్కారం పొందారు. ప్రత్యేకించి ఇళయరాజా సంగీత దర్శకత్వంలో పాడిన పాటలు, ఎస్పీ బాల సుబ్రమణ్యంతో కలసి పాడిన పాటలు ఎంతో పేరొందాయి. 1957లో విధియిన్ విలయాట్టు అనే తమిళ సినిమాతో కెరీర్‌ను ప్రారంభించిన ఆమె 2016 లో పాడడం ఆపేస్తున్నట్టు ప్రకటించారు. కల్మైమామణి, రాజ్యోత్సవ పురస్కారం, పద్మభూషణ్ ఇతర అవార్డులు అందుకున్నారు.

జామ్లింగ్ టెన్జింగ్ నార్గే



ప్రముఖ పర్వతారోహకుడు, గైడ్ టెన్జింగ్ నార్గే కుమారుడు జామ్లింగ్ టెన్జింగ్ నార్గే 1965 ఏప్రిల్ 23న జన్మించారు. తండ్రి బాటలోనే పర్వతారోహణలో తనదైన గుర్తింపు సాధించారు. 1996 లో ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించారు. పర్వతారోహణలో చోటు చేసుకున్న సాధక బాధకాలు, తండ్రి అనుభవాలు, రికార్డులు, మృతులు ఇలా పలు అంశాలతో ఒక పుస్తకాన్ని రాశారు. ప్రపంచవ్యాప్తంగా తిరుగుతూ మోటివేషనల్ స్పీకర్‌గా రాణించారు.



నివాళులు అర్పిస్తున్న నాయకులు

లెనిన్ బాట సమాజానికి అవసరం

సీపీఎం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్

పెనుకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని ఆచరణ ద్వారా నిరూపించిన లెనిన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మతోన్మాద రాజకీయాలకు లెనిన్ చూపినబాట చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హరి, బాబావలి, గంగాధర్, మహబూబ్ బాషా, బావమ్మ పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో అధిక దిగుబడులు

- ఏడీఏ కృష్ణమీనన్

మడకశిర రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ కృష్ణమీనన్ సూచించారు. మంగళవారం మడకశిర డివిజన్ పరిధిలో ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించిన 34 మంది రైతుల పంటలను రాష్ట్రసేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధికారి వెంకటేష్ పరిశీలించారు. మండలంలో ఆర్ అనంతపురం గ్రామంలో రైతు గిరీష్ సాగుచేసిన రాగి పంటను పరిశీలించారు. వ్యవసాయ అధికారులు సూచనలు సలహాలు పాటించడంతో గిరీష్ అధిక దిగుబడులు సాధించారన్నారు.



రైతు గిరీష్ పొలంలో అధికారులు

చెత్త సంస్కరణ స్థలంపై అభ్యంతరం



నగరసభ కమిషనర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



గ్రామపంచాయతీ అధ్యక్షుడు నందిని శేష

బంగారపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కేజీఎఫ్ పరిధిలో నిత్యం సేకరించే చెత్తను సంస్కరించేందుకు స్థలం సమస్య తలెత్తింది. తాలూకా సమీపంలోని దొడ్డవలగమాది పంచాయతీ సమీపాన కేజీఎఫ్ నగరసభ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చెత్త సంస్కరణ కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ గ్రామపంచాయతీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. నగరసభ కమిషనర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధ్యక్షులు నందిని శేష మాట్లాడుతూ పంచాయతీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేజీఎఫ్ నగరసభ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సరిహద్దులోని చెత్త సంస్కరణ కేంద్రాన్ని స్థాపించేందుకు ముందుకు వచ్చిందన్నారు. పర్యావరణాన్ని దెబ్బతీసే ఈ కేంద్రాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చెత్త సంస్కరణ కేంద్రం ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ప్రాంతాలు దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ కొండగుట్టలపై మేతకోసం వచ్చే పశువులు, మేకలు చెత్తరాశినుంచి వెలువడే ప్లాస్టిక్ వ్యర్థాలను తిని మృతిచెందితే ఎవరు బాధ్యత అన్నారు.

షెడ్ పేరిట సంస్కరణ కేంద్రానికి కుట్ర..?

గ్రామపంచాయతీ సభ్యుడు మునిరాజు మాట్లాడుతూ నగరసభ చెత్త సంస్కరణకోసం వాహనాలను నిలిపేందుకు షెడ్ నిర్మిస్తున్నారని చెబుతున్నారని అయితే ఇక్కడ చెత్త సంస్కరణ కేంద్రం స్థాపించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి దృష్టికి తెచ్చామన్నారు. కేజీఎఫ్ నగరసభ కమిషనర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ కేజీఎఫ్ నగరసభ ఆధ్వర్యంలో ఎలాంటి చెత్త సంస్కరణ కేంద్రాన్ని దొడ్డవలగమాది గ్రామపంచాయతీ వద్ద ఎలాంటి నిర్మాణం చేపట్టడం లేదన్నారు. ఇప్పటికే పారండహళ్ళి వద్ద చెత్త సంస్కరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అక్కడే చెత్తను సంస్కరిస్తున్నారన్నారు. నగరసభ పరిధిలో చెత్త సంస్కరణ చేసే వాహనాల కోసం షెడ్‌లను నిర్మిస్తున్నట్టు తెలిపారు.

పోస్టాఫీస్ నుంచి మామిడిపండ్ల సరఫరాకు శ్రీకారం

బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పోస్టల్‌శాఖ రాష్ట్ర మామిడి అభివృద్ధి, మార్కెటింగ్ కమిటీల సహకారంతో ఇంటి ముంగిటకే మామిడి పండ్ల సేవలను లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం హెడ్ పోస్టాఫీస్ (జీపీఓ)లో మామిడిపండ్ల సేవలను పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎస్ రాజేంద్రకుమార్ ప్రారంభించారు. మామిడి అభివృద్ధి మార్కెటింగ్ కమిటీ ఎండీ డాక్టర్ సీజీ నాగరాజు, పోస్టల్‌శాఖ డైరెక్టర్లు సందేశ్, తార, హెచ్ఎం మంజేశ్‌లు పాల్గొన్నారు. 2019లో సేవలు ప్రారంభించామని ఇప్పటివరకు 3.51లక్షల కిలోలను 1.02 లక్షలమంది వినియోగదారులకు పంపిణీ ద్వారా 83.55లక్షలు ఆదాయం గడించామన్నారు. ఈ ఏడాది మరింత ఎక్కువమందికి మామిడిపండ్లను ఇంటి ముంగిటకు అందించదలిచామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



జీపీఓలో మామిడిపండ్ల సరఫరాను ప్రారంభిస్తున్న ఉన్నతాధికారులు

దళితులకు సీఎం, పీఎం పదవులు ఇవ్వాలి



ప్రసంగిస్తున్న డాక్టర్ సీకే మౌల షరీఫ్

బాగేపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంలో 50ఏళ్లపాటు ప్రధానమంత్రులుగా దళితులకు అవకాశం కల్పించేలా ప్రస్తావించారని న్యాయవాది, డాక్టర్ సీకే మౌల షరీఫ్ ఫౌండేషన్ సంస్థాపకుడు డాక్టర్ సీకే మౌల షరీఫ్ అభిప్రాయపడ్డారు. బాగేపల్లి తాలూకాలోని జూలపాళ్య గ్రామంలో యల్లమ్మ దేవి ఉట్లు జాతరలో భాగంగా అమ్మవారి ఉయ్యాలోత్సవంలో పాల్గొని మాట్లాడారు. దేశాన్ని 800ఏళ్లపాటు మొఘలులు, తదితరులు పాలించారని 200ఏళ్లు బ్రిటీష్‌వారు పాలించారన్నారు. 1947లో స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించారన్నారు. దళితులకు గ్రామ పంచాయతీ, తాలూకా పంచాయతీ జిల్లా పంచాయతీ, ఎమ్మెల్యే, ఎంపీలు అయ్యేందుకు 50ఏళ్లపాటు ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు అయ్యేందుకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. రాజకీయ పార్టీలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దళితులను కొనియాడుతున్నాయని, ఇప్పటికీ మించిపోయింది లేదని 25ఏళ్లపాటు సీఎం, పీఎంలుగా దళితులకు అవకాశం కల్పించాలన్నారు. కార్య క్రమంలో గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు సీకే మహ్మద్ షరీఫ్, ముఖ్యులు ఆర్ కృష్ణమూర్తి, డెయిరీ అధ్యక్షుడు జేఆర్ నారాయణస్వామి, గ్రామపంచాయతీ సభ్యులు జేఆర్ ప్రశాంత్, చలవాది సీనియర్ ప్రముఖులు లైన్‌మ్యాన్ నరసింహయ్య ఆవులప్ప, ఈరప్ప పాల్గొన్నారు.

మే 21 నుంచి మద్యం వ్యసన నియంత్రణ శిబిరం



సన్నాహక సభలో వాసుదేవ్ తదితరులు

ముళబాగిలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ ధర్మాధికారి డాక్టర్ డి వీరేంద్రహెగ్డే నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 1910 మద్యంవ్యసనం వీడే శిబిరాల ద్వారా 1.30లక్షలమందికిపైగా ముక్తులయ్యారని తద్వారా ప్రశాంత జీవనం సాగిస్తున్నారని జిల్లా జనజాగృతి వేదిక అధ్యక్షుడు ఎంకే వాసుదేవ్ అభిప్రాయపడ్డారు. ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ యోజనాధికారి కార్యాలయంలో మద్యంవ్యసనం వీడే శిబిరాలకు సంబంధించి సన్నాహసభ జరిగింది. వాసుదేవ్ మాట్లాడుతూ జనజాగృతి కార్యక్రమాల ద్వారా గత పదేళ్లలో సంస్థ రూ.31.94 కోట్లు ఖర్చు చేయడం సంతోషమన్నారు. ముళబాగిలు తాలూకాలో ఇంతవరకు 4 మద్యంవ్యసనం వీడే శిబిరాలు నిర్వహించగా 180మంది దీనినుంచి బయటపడ్డారన్నారు. పట్టణంలోని శివ కేశవనగర్‌లోని సముదాయభవన్‌లో మే 21నుంచి 28వ తేదీ వరకు శిబిరం ఉంటుందన్నారు. ఇదే సందర్భంగా మద్యం వ్యసన నియంత్రణ శిబిరం వ్యవస్థాపనా సమితికి పదాధికారులను ఎంపిక చేశారు. సమావేశంలో సంస్థకు చెందిన పద్మయ్య, తిమ్మయ్యనాయక్, అశోక్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

రక్షించాలనుకుంటున్నాడు... రక్షణ మరిచాడు

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా పెను ప్రమాదం నుంచి బయటపడవచ్చుననేది తెలిసిందే. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా కిందపడితే తలకు దెబ్బతగులుతుంది. హెల్మెట్ ధరిస్తే శరీరంపై గాయాలైనా కొంతకాలానికి నయమయ్యే అవకాశాలు ఉంటాయి. పోలీసులు, రవాణాశాఖతోపాటు ఎన్నో స్వచ్ఛంద సంస్థలు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపరాదని అవగాహన కల్పిస్తున్నాయి. ఓ వ్యాపారి ఇలా ఎంతో మందిని రక్షించాలని హెల్మెట్‌లను విక్రయించడమే విధిగా పెట్టుకున్నాడు. లాభం ఎలా ఉన్న ఊళ్ల వెంబడి తిరిగి కావాలనుకున్నవారికి హెల్మెట్‌లను సమకూరుస్తున్నాడు. ఇదంతా బాగానే ఉన్నా ఆయన హెల్మెట్ ధరించి వాహనం నడపాలనేది మరిచాడు. బెంగళూరు శివారు బిడది సమీపంలో కనిపించిన దృశ్యమిది. **(స్టాఫ్ ఫొటోగ్రాఫర్, బెంగళూరు)**



జాబ్‌మేళా.. యువతకు సువర్ణావకాశం

హిందూపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు జాబ్‌మేళ సువర్ణావకాశమని చైర్మన్ రమేష్ అన్నారు. పట్టణంలోని బాలాజీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చైర్మన్ మాట్లాడుతూ.. స్కిల్‌డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళా నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరమన్నారు. నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు 22 కంపెనీలు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు మేళాలో పాల్గొని 200మందికిపైగా యువతీయువకులను ఎంపిక చేశారు.

జెండా ఎగరడమే తరువాయి..!

- నగర పంచాయతీలో మారుతున్న రాజకీయం
- టీడీపీకి జైకొట్టిన వైసీపీ కౌన్సిలర్లు
- చైర్మన్‌పై అవిశ్వాసం దిశగా పరిణామాలు

మడకశిర టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ త్వరలో టీడీపీ జెండా ఎగిరే అవకాశం కనిపిస్తోంది. మడకశిర నగర పంచాయతీలో 20 వార్డులు ఉన్నాయి. అప్పటి ఎన్నికల్లో 5 వార్డులను టీడీపీ, 15 వార్డులను వైసీపీ గెలుచుకుంది. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నేతృత్వంలో ఆ ఎన్నికల్లో గట్టి పోటీని ఇచ్చిన టీడీపీ.. నాలుగు స్థానాల్లో స్వల్ప తేడాతో ఓడిపోయింది. రెండు స్థానాలు కేవలం 10 ఓట్ల తేడాతో చేజారాయి. వైసీపీకి చెందిన 7వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనరసమ్మను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. సార్వత్రిక ఎన్నికల తరువాత సీన్ మారిపోయింది. వైసీపీ అధికారం కోల్పోవడం, స్థానికంగా టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో వైసీపీ వార్డు మెంబర్లు పునరాలోచనలో పడ్డారు. నగర పంచాయతీ అభివృద్ధి కోసం టీడీపీకి మద్దతు పలుకున్నారు. వైసీపీలో అంతర్గత పోరు తారస్థాయికి చేరడంతో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. లక్ష్మీనరసమ్మను దించేసి, 5వ వార్డుకు చెందిన టీడీపీ అభ్యర్థి నరసింహరాజును చైర్మన్‌గా ఎన్నుకుంటారన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీ కౌన్సిలర్లలో 8 మంది ఇప్పటికే టీడీపీకి జై కొట్టారు. 5వ వార్డు కౌన్సిలర్ ప్రియాంక, 2వ వార్డు సుధాకర్ నాయక్, 6వ వార్డు పార్వతమ్మ, 13వ వార్డు సుజాతమ్మ, 14వ వార్డు వెంకటలక్ష్మమ్మ, 17వ వార్డు సుభద్ర, 18వ వార్డు సావిత్రమ్మ తదితరులు బహిరంగగానే టీడీపీకి మద్దతు ప్రకటించారు.



మడకశిర నగర పంచాయతీ కార్యాలయం

వరల్డ్ 10కేకు రూ.3.40 కోట్ల నిధుల సేకరణ



మీడియాతో ప్రోకామ్ ఇంటర్నేషనల్ ఎండీ వివేక్ బి సింగ్ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టీసీఎస్ వరల్డ్ 10కే 17వ విడత పోటీలకు భారీగా నిధులు వచ్చాయి. ఎన్జీఓలు, కార్పొరేట్, సిటిజన్స్ చేయూతతో 3.40 కోట్ల రూపాయలు నిధులు సాధ్యమైనట్టు ప్రోకామ్ ఇంటర్నేషనల్ ఎండీ వివేక్ బి సింగ్ తెలిపారు. నగరంలో మంగళవారం ఫండ్ రైజింగ్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం జరిపారు. 75 ఎన్జీఓలు వారి నినాదాలతో రేసులో పాల్గొంటున్నాయన్నారు. ఏటా స్వచ్ఛంద సంస్థల సహకారం పెరుగుతోందన్నారు. ఇప్పటివరకు 400 ఎన్జీఓల ద్వారా రూ.55 కోట్ల నిధులు సాధ్యమయ్యాయన్నారు. ఈ ఏడాది 35 కంపెనీలతోపాటు 250మంది వ్యక్తిగతంగా ఫండ్ రైజింగ్‌లో భాగస్వామ్యులయ్యారన్నారు. దక్షిణభారత్‌లో అత్యంత ఎక్కువమంది పాల్గొనే రన్నింగ్ ఫెస్టివల్ అన్నారు. 35వేలమంది రన్నర్స్ ద్వారానే 3.40 కోట్ల రూపాయలు సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఎయిడ్‌బీస్ సీఈఓ జోమ్‌రాదాక్యాండి, జయనగర్ జాగర్స్, ప్రమోద్ దేశ్‌పాండే, సుదీర్‌శెట్టి, నైసా భట్టాచార్జీ తదితరులు పాల్గొన్నారు.

అత్తిబెలెలో అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నేతలు

దొమ్మసంద్ర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా అత్తిబెలె గెస్ట్‌లైన్ సమీపాన అంబేడ్కర్ జయంతిని మంగళవారం అర్థవంతంగా ఆచరించారు. కన్నడ జాగృతి వేదిక యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గౌరీశ్ మాట్లాడుతూ అత్తిబెలె పారిశ్రామికవాడ సమీపాన ఉన్న గెస్ట్‌లైన్‌లో ఏటా అంబేడ్కర్ జయంతి నిర్వహిస్తోందన్నారు. సమసమాజ నిర్మాణం కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. నెరళూరు గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ 30ఏళ్లుగా అంబేడ్కర్ జయంతి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివిధ ఫ్యాక్టరీలు, సంస్థల కార్మికులు, ప్రజల సహకారంతో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అంబేడ్కర్‌కు గౌరవపూర్వకంగా సమర్పిస్తున్నట్టు తెలిపారు. నిర్వాహకులు శ్రీనివాస్, రామస్వామి, కుమార్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై ఆసక్తి పెంచుకోవాలి




కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయాధికారి

శిడ్లఘట్ట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ భూమి దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా ఆధ్వర్యంలో సాంకేతికంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం అధికంగా ఉండడంతో మానవుడి ఆరోగ్యానికి అపాయకరమన్నారు. ఆహారం ద్వారా మన శరీరంలోకి ప్రవేశించి ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోందన్నారు. పచ్చదనం, పర్యావరణం కోసం అందరూ ఆసక్తి చూపాలన్నారు. అదనపు న్యాయాధికారి రంజితా ఎస్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, సంఘం ప్రధాన కార్యదర్శి సీజీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో విద్య పాత్ర కీలకం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజనిర్మాణంలో విద్య పాత్ర కీలకమని బీఆర్ఎస్ బిల్డర్స్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బి సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని సాదలి క్రాస్‌వద్ద నూతనంగా నిర్మించిన ఓం టెక్నోస్కూల్‌ను ప్రారంభించి మాట్లాడారు. చదువులేనివారు నేటికీ పేదరిక జీవనం అనుభవిస్తున్నారన్నారు. విద్యావంతులైతే తమ జీవనాన్ని, జీవనశైలిని మార్చుకునే సామర్థ్యం ఉంటుందన్నారు. సమాజంలో మార్పు తేవడంలో పాఠశాలల పాత్ర కీలకమన్నారు. రూరల్ ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు నారాయణస్వామి మాట్లాడుతూ విద్యతోనే విపులమైన అవకాశాలు సాధ్యమన్నారు. విద్యార్థులు వ్యవహారిక జ్ఞానం పెంచుకోవాలని, ఆంగ్ల భాషకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాఠశాల ఉపాధ్యక్షుడు మంజునాథ్, సంస్థాపకుడు నవీన్ కుమార్, గ్రామపంచాయతీ సభ్యులు విజయానంద (అవులరెడ్డి), శశికళ సురేశ్, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు గోవిందరాజు, బీ పార్వతి, రిటైర్డు టీచర్ నారాయణస్వామి, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.42	1,578.57
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	345	177
నీటి నిల్వ (టీఎంసీలు)	6.95	3.82



జలమయమైన రహదారి

సండూరులో జోరు వాన

బళ్లారి సిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సండూరు పట్టణం సహా తాలూకాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కరువుతో బాధపడుతున్నరైతులకు వర్షం కాస్త ఉపశమనం కలిగించినట్లయింది. సడూరులో 10.2 మి.మీ, చోరనూర్‌లో 20.3మి.మీ, కురేకుప్పలో 4.4మి.మీ వర్షపాతం సమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. విఠలాపూర్‌లో 4.4మి.మీ వర్షపాతం నమోదైంది. గ్రామసమీపంలో పలు అరటి చెట్లు కూలిపోయాయి. మామిడి కాయలు రాలి పోవడంతో రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు.

నవజాత శిశువులకు టీకా తప్పనిసరి

బళ్లారి సిటీ,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని, టీకా ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు తెలియజేయాలని జిల్లాపంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ హారిస్ సుమైర్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా ఆరోగ్య సంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. టీకాల గురించి అపోహాలు ఉన్న తల్లిదండ్రులకు సరైన సమాచారం అందించాలనా,ఇ టీకా వేయించుకునేలా తల్లిదండ్రులను సిద్ధం చేయాలన్నారు. వ్యాక్సినేషన్ వీక్‌లో బాగంగా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నిర్వహించే ప్రచార కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. టీకా వేయించుకునేలా అందరికీ అవగాహన కల్పించడం ద్వారా జిల్లా అంతటా టీకాల ప్రచారకార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, జిల్లాసర్జన్ బసారెడ్డి, డాక్టర్ ఇందుమతి, డా.శ్రీధర్, ఆర్‌సీఓ హనుమంతప్ప, డాక్టర్ అబ్దుల్లా, డా.మరియంబి, డా.పూర్ణిమ, వీరేంద్రకుమార్, తాలూకా హెల్త్ ఆఫీసర్లు, భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న జడ్పీ సీఈఓ మహ్మద్ హ్యారిస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బసవ జయంతిని ఘనంగా నిర్వహించాలి

● సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక నాయకుడు బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్మే మాట్లాడుతూ.. బసవ జయంతి నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. బసవేశ్వర సర్కిల్లో రూ.1.5కోట్లతో అశ్వరూఢ బసవన్న విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్ఠించాలన్నారు. నగర జిల్లా కాంగ్రెస్ అద్యక్షుడు అల్లం ప్రశాంత్ మాట్లాడుతూ నగరంలోని కేఈబీ సమీపంలోని సర్కిల్‌కు బసవేశ్వర సర్కిల్‌గా పేరు పెట్టాలని కార్పొరేషన్ నిర్ణయం తీసుకుందన్నారు. వచ్చే సంవత్సరం ఈ సర్కిల్ నుండే బసవన్న చిత్రపట ఊరేగింపు ప్రారంభిస్తామన్నారు. ఈసందర్భంగా కమ్మరచేడు సంస్థాన్ మఠం అభినవ సిద్ధలింగ శివాచార్య స్వాములు, కల్యాణ స్వామి. అఖిల భారత వీరశైవ మహాసభ ఆంధ్రప్రదేశ్ అద్యక్షుడు దండిన శివానంద, తిమ్మనగౌడ, బసవరాజ్,జానెకుంటే బసవరాజు, చోరనూర్ కొట్రప్ప, మల్లనగౌడ, డా.మహిపాల్, పంపనగౌడ, పన్నరాజ్,చానల్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం

కంప్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వరిసిహళ్ల క్యాంపులో గొర్రెల కాపరి సండూరు లక్ష్మణ్ణ పిడుగుపాటుకు మృతి చెందగా కుటుంబానికి పరిహారం అందజేశారు. ఎస్‌డీఆర్ఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ. ఐదు లక్షలు పరిహారం చెల్లింపు ఉత్తర్వుల కాపీని ఎమ్మెల్యే అన్నపూర్ణ మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు నగేష్, పీడీఓ రామప్ప మాలగి, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నపూర్ణ మాట్లాడుతూ పశువులు కాపరులు వర్షాకాలంలో జాగ్రత్తలు వహించకపోతే ప్రమాదం తప్పదన్నారు. సాయంకాలం లోపుగా ఇంటికి చేరుకుని పిడుగుల భారి నుంచి కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

26 నుంచి పశువులకు టీకా



గ్రామాల్లో పర్యటిస్తున్న పశువైద్యాధికారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రాయోజిత ఎన్ఏడీసీపీ పథకం కింద ఏప్రిల్ 26నుంచి జూన్ 6వ తేదీ వరకు జిల్లా పశువులకు టీకా వేయనున్నారు. ఫుట్ అండ్ మౌత్ డీసీజ్, చర్మ కేన్సర్‌కు వ్యతిరేకంగా 7వ రౌండ్ ఉచిత టీకా ప్రచారం చేపట్టనున్నారు. ఈప్రచారం సందర్భంగా రైతులు తమ పశువులకు ,పెంపుడు జంతువులకు తప్పకుండా టీకాలు వేయించాలని పశుసంవర్ధక , పశువైద్య సేవల విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హనుమంత్ కరబారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ పశుగణనప్రకారం బళ్లారి జిల్లాలో మొత్తం 1.80.611పశువులు ఉన్నాయి. వాటిలో 1.14,577పశువులు ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. వ్యాధి గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులు తమ పశువులు,గేదెలకు ముఖ్యంగా నాలుగు నెలల కంటె ఎక్కువ వయస్సు ఉన్న పశువులకు కాళ్ల, నోటి వ్యాదికి వ్యతిరేకంగా టీకాలు వేయించి జీవాలను కాపాడుకోవాలన్నారు.

నాసిరకం విత్తనాలతో నిండా మోసం



దిగుబడి లేని పంటను చూపుతున్న రైతు మర్రిస్వామి

కంప్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హగరి బొమ్మనహళ్లి తాలుకా పరిధిలోని శివపుర గ్రామానికి చెందిన రైతు మర్రిస్వామి, కొట్రేష్ పేరుతో ఉన్న దుకాణంలో రాగివిత్తనం రబీ పంటకు కొనుగోలు చేశారు. ఒకటిన్నర ఎకరంలో రాగిని సాగు చేశారు. చివరికి నాసిరకం విత్తనం అని తేలడంతో ఆవేదనకు గురయ్యాడు. ఏపుగా పెరిగినా పంటలో గింజమాత్రం లేకపోయింది. పంట పూర్తిగా నష్టపోవడంతో పంటలకు తెచ్చిన రుణాలు కట్టలేక చివరకు ఆత్మహత్యలే శరణ్యమవుతాయని రైతు మర్రిస్వామి తెలిపారు. ఇలాంటి నాసిరకం అమ్మే విత్తనాలు దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా తాలుకా స్థాయిలో ఎంతో మంది రైతులు ఇలా మోసపోయి నష్టాల పాలయ్యారు. రానున్న ఖరీఫ్ పంటల సమయంలోనైనా ప్రతి రసాయనానికి ఎరువులు విత్తనాలు దుకాణాలు వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి విత్తనం క్రిమికీటక మందులు పిచికారి మందులు ప్రతి ఒక్కటి పరిశీలించిన అనంతరమే మార్కెట్లో అమ్మకాలకు సిద్ధంగా ఉంచాలని రైతులు కోరుతున్నారు. ప్రతి యేటా బళ్లారి విజయనగర జిల్లాలో ఎంతోమంది రైతన్నలు మోసపోతూనే ఉన్నారన్నారు. ఇంతవరకు అధికారులు మాత్రం సరైన చర్యలు తీసుకోలేక విఫలమవుతున్నారు. మున్ముందు ఇలాగే కొనసాగితే తమ కార్యాలయాల ముందు నిరసనలు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు.

లోకాయుక్తకు పట్టుబడిన తహసీల్దార్

● రైతు నుంచి లంచం తీసుకుంటుండగా దాడులు



తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రైతు నుంచి తహసీల్దార్ లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. మంగళవారం లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు తెలిపిన వివరాల మేరకు సిరుగుప్ప తాలుకాకు చెందిన హాళేమారి సమాజానికి భూమి కొనుగోలు చేయాలని జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారులు తహసీల్దార్‌కు సూచించారు. మాంతేష్ అనే రైతు పొలం పరిశీలనకు తహసీల్దార్ లంచం డిమాండ్ చేశారు. మాంతేష్ లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశాడు. వల పన్నిన అధికారులు మంగళవారం సాయంత్రం ఆయన ఇంట్లో లంచం తీసుకుంటుండగా దాడి చేసి అరెస్టు చేశారు. తహసీల్దార్‌నులోకాయుక్త జిల్లా కార్యాలయానికి తరలించారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సివిల్ న్యాయాధికారి అశోక్

సిరుగుప్ప, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధరిత్రి దినోత్సవంపై ఎంతో కథ వుందని సివిల్ న్యాయాధికారి అశోక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో తాలుకా పరిపాలన న్యాయవాదుల సంఘం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ భూ దినోత్సవంను నిర్వహించారు. తహసీల్దార్ మొక్కలకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మట్టి రకాలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ డైరెక్టర్ పాటిల్, తహసీల్దార్ విశ్వనాథ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వెంకోబ, న్యాయవాదులు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం.. ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

బళ్లారి రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉదోగ్యం ఇప్పిస్తానని మోసం చేసిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సంతోష్ చౌహాన్ తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లాకు చెందిన ఒక వ్యక్తి అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.2.50 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన వైభీమేష్ కుమార్ అతని స్నేహితుడు శివరాం ఓ వ్యక్తి నుంచి రూ. 8 లక్షలు తీసుకుని ఉద్యోగం పేరుతో మోసం చేశారన్నారు. బాధితుడి ఫిర్యాతు మేరకు విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

నకిలీ క్లినిక్‌పై అధికారుల దాడులు



నిడిగుర్తి గ్రామంలో నకిలీ క్లినిక్‌ను సీజ్‌చేస్తున్న అధికారులు

కంప్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా పరిధిలోని నిడుగుర్తి గ్రామంలో వైద్యాధికారులు దాడులు నిర్వహించారు. ఆర్ఎంపీ డాక్టర్ రామన్న ఆస్పత్రిని సండూరు తాలుకా వైద్యాధికారి డాక్టర్ భరత్‌కుమార్ సీజ్ చేశారు. నకిలీ వైద్యుడిగా కొనసాగుతున్న రామన్నను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి కేపీఎంఈ చట్టం కింద కేసు నమోదు చేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ తెలిపారు. నకిలీ వైద్యులు పదో తరగతి చదివి ఎలాంటి కోర్సులు పూర్తికాక ముందే డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడని ఫిర్యాదు మేరకే క్లినిక్‌పై దాడి చేసినట్లు తెలిపారు. తాలుకా పరిధిలోని అనుమానం ఉన్న క్లినిక్‌లు ఇకపై తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

జొన్న కొనుగోలుకు రైతుల డిమాండ్

రాయచూరు ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన చొన్నల కొనుగోలు కోసం వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కేంద్రాల్లో రైతుల పేర్లు నమోదు కోసం చేసిన ఒకే రోజు అవకాశంతో అందరికి ఇబ్బంది తలెత్తిందని వెంటనే పేర్ల నమోదుకు తిరిగి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల తీరును నిరశిస్తు మంగళవారం రైతులు రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. కర్ణాటక రైతు సంఘం, హసిరు సేనల ఆధ్వర్యంలో మాన్వి తాలూకా హిరెకొట్నెకల్ గ్రామ రైతులు బాగలకోట క్రాస్ వద్ద రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సింధనూరు-రాయచూరు మార్గంలో వాహనదారులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. ఈ సందర్భంగా మాట్లాడిన అమీన్ పాషా దిద్దిగి, ఖరీఫ్ సీజన్‌లో పండించిన జొన్నల కొనుగోలు కోసం పేర్లు నమోదు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రైతుల నుంచి కొనుగోలు చేయలేదన్నారు. దీంతో పాటు రబీ సీజన్‌లో ఒక్క రోజు మాత్రమే రైతులకు పేర్ల నమోదుకు అవకాశం కల్పించడంతో పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదన్నారు. అధికారులు స్పందించి రబీ సీజన్ జొన్న కొనుగోలుకు అవకాశం కల్పించాలని కోరారు.

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు

సిరుగుప్ప, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): కూలీ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చీఫ్ సెక్రటరీ మహమ్మద్ హారున్ తెలిపారు. మంగళవారం తాలుకాలోని సిరిగేరి, ముద్దటనూరు, కరూరు వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించారు. కూలీ కార్మికులు పనిచేస్తున్న స్థలానికి వెళ్లి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి వ్యవస్థ, నీట చాటున వుండేందుకు షెడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత పంచాయతీ శాఖ అధికారులు కూలీ పనులకు వచ్చిన ప్రతి ఒక్కరి అటెండెన్స్ తీసుకోవాలని సూచించారు.

హోసూరు జోన్

క్వారీ యజమానుల సమ్మె విరమణ



సంఘం జిల్లా అధక్షుడు సంబంగి

హోసూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పెంచిన మైనింగ్ ట్యాక్స్‌ను తగ్గించాలని కోరుతూ క్వారీ, క్రషర్‌ల యజమానుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం విరమించారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, డెంకణీకోటె, శూలగిరి ప్రాంతాలలో వందలసంఖ్యలో క్వారీలు, క్రషర్‌లు ఉన్నాయి. సోమవారం రాత్రి జలవనరులశాఖ మంత్రి దురై మురుగన్‌తో జరిపిన చర్చలు ఫలించాయని, 24 డిమాండ్లలో 22ను ప్రభుత్వం అంగీకరించిందని, నిరవధిక సమ్మెను విరమించుకుంటున్నట్టు కృష్ణగిరి జిల్లా క్రషర్ యజమానుల సంఘం అధ్యక్షుడు సంబంగి తెలిపారు. ప్రభుత్వం నాయ్యం చేస్తుందన్న నమ్మకం ఉందన్నారు.

హ్యాండ్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపిక

హోసూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తమిళనాడు హ్యాండ్‌బాల్ జట్టుకు హోసూరు బాలికలు ఎంపికయ్యారు. ఖేలో ఇండియా యూత్‌గేమ్స్ 2025 మే 4నుంచి 14వరకు బిహార్ రాష్ట్రంలో జాతీయస్థాయిలో జరగనున్నాయి. పోటీల్లో తమిళనాడు ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖోఖో జట్లు పాల్గొంటున్నాయి. తమిళనాడు జట్టుకు ఎంపికైన జట్టును కోచ్ వ ాణి క్యవా సగ ం న ు ప్రత్యేకంగా అభినందించారు. హోసూరు ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులు నవనీత, ధనలక్ష్మి 12వ తరగతి చదువుతున్నారు. హోసూరులోని తంగవేలు అయ్య వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. తమిళనాడు మహిళల హ్యాండ్‌బాల్ జట్టు ఈనెల లో జాతీయ స్థాయి ఖేలో పోటీల్లో పాల్గొననున్నారు.



ఎంపికైన విద్యార్థినులతో కోచ్ మాణిక్యవాసగం

బళ్లారికి చేరుకున్న శరణుల రథయాత్ర

బళ్లారి సిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక నాయకుడు విశ్వగురు బసవన్న జీవితం, సందేశం ఆలోచనలను ప్రచారం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన అనుభవ మంటప బసవాది శరణుల వైభవ రథయాత్ర మంగళవారం బళ్లారికి చేరుకుంది. నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కాలేజీ మైదానంలో రథయాత్రకు సంఘం నాయకలు స్వాగతం పలికారు. జిల్లాయంత్రాంగం కన్నడ సంస్కృతిక శాఖ బసవాది శరణుడి రథయాత్రకు పూజలు నిర్వహించారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో బాగల్‌కోట్ జిల్లా కూడల సంగమంలో రెండు రోజులు పాటు నిర్వహించే అనుభవ మంటపం బసవాది శరణ వైభవం కార్యక్రమంలో బాగంగా మంగళవారం బళ్లారి నగరానికి చేరుకున్న రథయాత్ర సిరుగుప్ప మీదుగా రాయచూరు జిల్లాకు సాగింది. ప్రపంచంలోనే మొట్టమొదటి పార్లమెంట్ అనుభవం మంటపం బసవాది శరణుల యొక్క అద్భుతమైన రథంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, బవసన్న, గౌతమబుద్ధుడు, అక్కమహాదేవి శిశుపాల షరీఫ్, గురునానక్, మహావీరుడు, నారాయణ గురు, యేసు క్రీస్తు తదితర విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు రథాన్ని సందర్శించుకుని పరిశీలిచాఆరు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతికశాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజ్, రాష్ట్రీయ బసవ దళ కార్యదర్శి రవిశంకర్, నాయకులు పన్నరాజ్, టీహెచ్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బసవాది శరుణుల వైభవ రథయాత్రలో సంఘం నాయకులు



నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

హులిగి దేవస్థానంలో భక్తుల సందడి

బళ్లారి రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా మునిరాబాద్‌లోని హులిగి దేవస్థానం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. బళ్లారి, విజయనగర, కొప్పళ, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నైవేద్యం సమర్పించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.



అలంకరణలో హులిగి అమ్మవారు